
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
బుధవారం 2 అక్టోబరు 2024 | 5





నేడు గాంధీ జయంతి

గాంధీ.. నడిచాడిక్కడ!

ఉమ్మడి తూర్పున బాపూజీ అడుగుజాడలు

మహాత్ముడి జీవితమే.. ఒక మహోద్యమం. చేతిలో ఊతకర్ర.. బక్కపలుచని శరీరం.. అదీ వయస్సుమీరిన రోజుల్లో ఎలాంటి ఆయుధం లేకుండా స్వాతంత్ర్యం సిద్ధించేదాకా జాతి యావత్తునూ ఏకతాటిపై నడిపించాడంటే ఆయనను మహాత్ముడుకాక ఇంకేమంటాం. అందుకే ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ గాంధీజీని ఉద్దేశించి చెప్పినట్టు "కొన్నేళ్ల తర్వాత రక్తమాంసాలు గల ఇలాంటి వ్యక్తి భూమ్మీద నడిచాడని చెబితే రాబోయే ముందు తరాల వారు నమ్మలేరు.." ఎంత గొప్ప నిర్వచనం ఇది. స్వాతంత్ర్య పోరాటం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో మన జాతిపిత దేశమంతటా పర్యటించారు. ప్రజలందరినీ స్వాతంత్ర్య సమరంలోకి దూకేలా ఉత్తేజితమైన ప్రసంగాలు చేశారు. పోరాటంలో ముందుండి నడిపించారు. మన గోదావరి జిల్లాల్లోనూ గాంధీజీ విస్తృతంగా పర్యటించి సమరశంఖం పూరించారు. ఆయన వెంట ప్రజలంతా ఏకమై నడిచారు. స్వరాజ్యం మా హక్కని ముక్తకంఠంతో నినదించారు. స్వాతంత్ర్య పోరులో జైళ్లకెళ్లారు. గాంధీజీ జయంతి సందర్భంగా ఆయన స్మృతులు మళ్లీ ముందుకు..

- రాజమండ్రి (ఆంధ్రజ్యోతి)/ కాకినాడ సిటీ/కరప


రాజమండ్రికి వచ్చింది.. 5 సార్లు

1921 మార్చి 30వ తేదీ రాత్రి గాంధీ తొలిసారిగా రాజమహేంద్రవరంలో అడుగుపెట్టారు. విజయనగరంలో తన పర్యటన ముగించుకుని బెజవాడ మెయిల్‌లో వెళుతూ ఇక్కడి రైల్వే స్టేషన్‌లో ఆహ్వానం మేరకు దిగారు. 1921 ఏప్రిల్ 6వ తేదీన మహాత్మాగాంధీ దంపతులు కాకినాడ నుంచి రాజమహేంద్రవరం సభకు విచ్చేశారు. 1929 మే 6న గాంధీ మూడోసారి వచ్చారు. గాంధీజీ.. సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు టౌన్‌హాల్‌ను సందర్శించినట్టు చెబుతారు. 1933 డిసెంబర్ 24న ఆయన నాల్గోసారి పాల్ చౌక్‌లో ఆయన ప్రసంగించారు. ఐదోసారి అంటే చివరగా 1946 జనవరి 20 రాజమండ్రి వచ్చారు.

దక్షిణాఫ్రికా టూ తుని..

తుని రూరల్ : స్వాతంత్రోద్యమ పర్యటనకు ముందే గాంధీ తునిలో పర్యటించి బస చేశారు. ఆ ప్రాంతం ప్రస్తుతం గాంధీ సత్రంగా పేరుపడింది. 1915లో దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి వచ్చిన గాంధీజీ దేశ ప్రజల స్థితిగతులను తెలుసుకునేందుకు దేశ పర్యటనలో భాగంగా 1916లో రైలులో మార్గమధ్యలో తునిలో ఆగారు. తునికి ప్రధాన కూడలిగా ఉన్న గొల్లప్రోలు సెంటర్ పక్కనే సత్రం ప్రాంగణంలో ఒక పెద్ద చెట్టు కింద ఈ ప్రాంతవాసులతో సభ నిర్వహించి స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపారు. ఆ రాత్రి అక్కడే బస చేసి మరుసటిరోజే పయనమయ్యారు.

కాకినాడలో మ్యూజియం



కార్పొరేషన్(కాకినాడ):స్వాతంత్రోద్యమ సమయం 1921 నుంచి 1929 మధ్యలో మూడుసార్లు గాంధీజీ కాకినాడ వచ్చారు. గాంధీజీ ఇక్కడికి వచ్చినప్పటి విషయాలతో పాటు ఆయన బాల్యం నుంచి స్వాతంత్ర్యం సాధించే వరకు ఉన్న జీవిత ఘట్టాలను తెలియజేస్తూ కాకినాడ కార్పొరేషన్ వెనుక ప్రాంతంలో గాంధీభవన్ ఏర్పాటు చేశారు. ఇందులో గాంధీజీ మ్యూజియం, ఆయన చిత్రపటాలతోపాటు 400 కిలోల కాంస్య విగ్రహం ఏర్పాటుచేశారు. ఆయనను నిత్యం స్మరించుకునేలా గాంధీనగర్‌లో ఓ పార్కుకు గాంధీపార్కుగా, ఓ ప్రాంతానికి గాంధీనగర్‌గా అప్పట్లోనే నామకరణం చేశారు. కాకినాడ గాంధీభవన్ పేరున కరపలో 5.87 ఎకరాల భూమి ఉంది. వేళంగి గ్రామానికి చెందిన మెర్ల వెంకటసుబ్బారావు 1952 ఆగస్టు 5న తన స్వార్జిత భూమిని గాంధీభవన్ ట్రస్ట్‌కు రాసిచ్చారు.

కాకినాడకు మూడుసార్లు..

స్వాతంత్రోద్యమకాలంలో మహాత్మాగాంధీ కాకినాడలో మూడుసార్లు పర్యటించారు. 1921 ఏప్రిల్ 3న కాకినాడలో గాంధీజీ దంపతులు, వారి నాలుగో కుమారుడు రైలు దిగారు. గుర్రపు బండిపై పెద్ద బజారు గుండా జగన్నాథపురంలోని ఫైడా వెంకట నారాయణ ఇంటికి చేరుకున్నారు. 1923 డిసెంబర్ 28న గాంధీనగర్‌లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సభలకు జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయి పటేల్ వంటి నేతలు విచ్చేయగా, పరవాడ జైలులో ఉన్న కారణంగా మహాత్మాగాంధీ హాజరు కాలేకపోయారు. ఆ తర్వాత 1930, 1933లలో రెండుసార్లు కాకినాడ వచ్చిన గాంధీ స్వాతంత్రోద్యమ సభల్లో పాల్గొన్నారు.

సీతానగరంలో సత్యాగ్రహాశ్రమం



గాంధీ బసచేసిన చోడవరంలో భవనం ఇదే

సీతానగరం: రాజమహేంద్రవరానికి 25 కి.మీ దూరంలో ఉన్న సీతానగరంలో 1924 నవంబరు 9న వైద్యుడు బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం గోదావరి గట్టుకు సమీపంలో గౌతమి సత్యాగ్రహాశ్రమం పేరుతో ఏర్పాటుచేశారు. దీనికి అల్యూమినియం వ్యాపారి శేఠ్ జీవన్‌లాల్ ఆర్థిక సాయం అందించారు. ఈ ఆశ్రమాన్ని బాపూజీ రెండుసార్లు సందర్శించడం విశేషం. 1925 ఫిబ్రవరి 4న డాక్టర్ బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం ఇక్కడ గృహప్రవేశం జరిపారు. గాంధీజీ తన స్వాతంత్రోద్యమ పర్యటనలో భాగంగా 1929 మే 8, 9 తేదీల్లో ఆశ్రమంలో బస చేశారు. 1933 డిసెంబరులో ఈ ఆశ్రమానికి రెండోసారి వచ్చి ఆశ్రమవాసులను ఉత్తేజపర్చారు. బాపూజీ సతీసమేతంగా ఆశ్రమంలో విశ్రాంతి తీసుకున్నారు. కస్తూర్బాగాంధీ పరమపదించిన అనంతరం ఆమె పేరుతో గౌతమి సత్యాగ్రహాశ్రమానికి కస్తూర్బాగాంధీ ఆశ్రమంగా పేరు మార్చారు.

నేటికీ ఆ గాంధీ భవన్‌లు పదిలమే!

ద్రాక్షారామ/రాజోలు: మహాత్మాగాంధీ స్వాతంత్ర్య పోరాటంలో 1929 ఏప్రిల్, మే నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. మే నెలలో రామచంద్రపురం మండలం వెల్ల, చోడవరం గ్రామాల్లో గాంధీజీ పర్యటించారు. మే 1న వెల్ల వంతెన వద్ద బహిరంగ సభలో ప్రసంగించారు. అనంతరం సాయంత్రానికి చోడవరం చేరుకుని రాత్రి బిక్కిన వెంకటరత్నం (మాజీ కేంద్ర మంత్రి) నివాసంలో బసచేశారు. ఆ భవనం ఇప్పటికీ చెక్కు చెదరలేదు. 1929 మే 5న ఆదివారం గాంధీ అమలాపురం మీదుగా సాయంత్రం 6 గంటలకు మామిడికుదురు మండల పాశర్లపూడి రేవు దాటారు. గాంధీ తన సహచరి కస్తూరిబాతో రాత్రి 8 గంటలకు పొన్నాడ సూర్యారావు ఇంటికి అతిథిగా విచ్చేశారు. వారికి అపూర్వమైన ఆతిథ్యాన్ని సూర్యారావు అందించారు. ఆ రాత్రి గాంధీజీ మౌన వ్రతం చేశారు. 1929 మే 5, 6 తేదీల్లో పొన్నాడ సూర్యారావు ఇంట్లోనే గాంధీ బస చేయడం విశేషం. అప్పటి నుంచి ఆ ఇల్లు గాంధీ హౌస్ అయింది.



కాకినాడ 21వ డివిజన్‌లో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు



శంఖవరం మండలం కత్తిపూడిలో లబ్ధిదారురాలికి పింఛను అందజేస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

రికార్డు స్థాయిలో...

- 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లు తొలిరోజే 97.33 శాతం పంపిణీ
- ఆనందం వ్యక్తం చేసిన లబ్ధిదారులు

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 1: జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంగళవారం రికార్డు స్థాయిలో పంపిణీ చేశారు. 2,75,679 మంది లబ్ధిదారులు ఉండగా 2,68,311 మందికి పంపిణీ చేశారు. ఉదయం 6 నుంచి రాత్రి 7గంటల వరకు 97.33 శాతం పంపిణీ జరిగింది. దీంతో పింఛనుదారులు ఆనందం వ్యక్తం చేశారు. మండలాల వారీగా పింఛను పంపిణీ శాతాలు ఇలా వున్నాయి.... పిఠాపురం అర్బన్ 98, కాకినాడ అర్బన్‌లో 98, గొల్లప్రోలు అర్బన్‌లో 98, తుని రూరల్ 97, సామర్లకోట అర్బన్ 97, గండేపల్లి 97, పెద్దాపురం అర్బన్ 97, తుని అర్బన్ 97, పిఠాపురం 97, తాళ్లరేవు 97, కరప 97, పెద్దాపురం 97, ఏలేశ్వరం అర్బన్ 97, కొత్తపల్లి 97, సామర్లకోట 97, పెదపూడి 97, శంఖవరం 97, కోటనందురు 97, కాకినాడ రూరల్ 97, కాజులూరు 97, కిర్లంపూడి 96, జగ్గంపేట 96, గొల్లప్రోలు 96, ప్రత్తిపాడు 96, రౌతులపూడి 96, ఏలేశ్వరం 96, తొండంగి 96.

పంచదారతో పాటు కందిపప్పు



- జిల్లాకు 250 మెట్రిక్ టన్నులు కేటాయింపు
- ప్రభుత్వ చౌక ధరల దుకాణాల్లో పంపిణీకి సిద్ధం

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 1: పంచదారతో పాటు కందిపప్పు పంపిణీకి కూటమి ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ప్రభుత్వ చౌక ధరల దుకాణాల్లో ఈ నెల నుంచి కందిపప్పు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు జిల్లాకు 250 మెట్రిక్ టన్నుల కందిపప్పు కేటాయించారు. ఒక్కొక్క కార్డుపై కిలో రూ.67కే సబ్సిడీపై అందజేయనున్నారు. పంచదార అర కిలో రూ.17కే అందస్తారు. జిల్లాలో 6.54 లక్షల రేషన్ కార్డులున్నాయి. వీరికి బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు అందజేయనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటి అదనంగా ఇస్తూ వెళ్తున్నారు. తొలుత బియ్యం, తర్వాత పంచదార పంపిణీ చేశారు. ఈనెల నుంచి కందిపప్పు ఇస్తారు. వైసీపీ ప్రభుత్వ హయంలో రేషన్‌లో సరుకుల కోత విధించారు. పంచదార, కందిపప్పు ఇవ్వకుండా లబ్ధిదారులకు మొండిచేయి చూపించారు. పైగా ఎండీయూ వాహనాల పేరిట వందల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారు. దీంతో పౌరసరఫరాల శాఖ అప్పుల పాలైంది. బియ్యం సరఫరా చేయడం కూడా గగనమైపోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్‌కార్డుదారుల ప్రయోజనమే లక్ష్యంగా పంపిణీ చేస్తున్నారు. బియ్యం, పంచదార, కందిపప్పు, రాగులు పంపిణీ చేస్తున్నారు. భవిష్యత్తులో మరెన్ని నిత్యావసర సరుకులను సబ్సిడీపై రేషన్‌లో అందజేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. దీంతో లబ్ధిదారులు సంబరాలు చేసుకుంటున్నారు.

రేషన్ కార్డుల విభజనకు బ్రేక్!

- తదుపరి ఆదేశాలు వచ్చే వరకు వద్దు
- ఆదేశాలు జారీ చేసిన కమిషనర్

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 1: రేషన్ కార్డుల విభజన ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు రేషనలైజేషన్ చేయవద్దని ఆ శాఖ కమిషనర్ ఆదేశించారు. కాకినాడ జిల్లాలో దాదాపు పది రోజుల క్రితం రేషన్ కార్డుల విభజన ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ చౌక ధరల దుకాణాల్లో 400 రేషన్ కార్డులు ఉండేలా విభజించాలని ప్రభుత్వం జీవో ఇచ్చింది. పట్టణాల్లో 600 కార్డులు, కార్పొరేషన్‌లో 800 రేషన్ కార్డులు ఉండేలా విభజన చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మండలాల్లో తహసీల్దార్లు విభజిస్తున్నారు. దీనిని రేషన్ డీలర్లు వ్యతిరేకిస్తున్నారు. కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో మంగళవారం హైకోర్టు ఆదేశాలిచ్చింది. రేషన్‌డీలర్ల అభిప్రాయాలు తీసుకోకుండా విభజన చేయవద్దని పేర్కొంది. దీంతో విభజన ప్రక్రియను అధికారులు తాత్కాలికంగా నిలుపుదల చేశారు. జిల్లాలో 1,060 ప్రభుత్వ చౌక ధరల దుకాణాలు ఉన్నాయి. రేషన్ కార్డుల విభజన జరిగితే మరో 170 కొత్తగా ఏర్పాటవుతాయని అందరూ భావించారు. రేషన్ డీలర్లు తీవ్రంగా వ్యతిరేకించడంతో ఈ ప్రక్రియకు అడ్డుకట్ట పడింది.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రత్నగిరి ముస్తాబు

3 నుంచి 12 వరకు రోజుకో అలంకారంలో అమ్మవార్లు

...7లో



శ్రీనివాసరావుకు బంగారు పతకాలు అందజేస్తున్న దృశ్యం

ఆర్టీసీ డ్రైవర్ అదరగొట్టాడు

అంతర్జాతీయ స్థాయిలో మూడు బంగారు పతకాలు సాధించిన శ్రీనివాసరావు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 1: సింగపూర్, మలేషియా దేశాల్లో సెప్టెంబరులో జరిగిన ఎస్‌కేబీఎఫ్ 10వ అంతర్జాతీయ పోటీల్లో పవర్ లిఫ్టింగ్ విభాగంలో కాకినాడ జిల్లా కాకినాడ ఆర్టీసీ డిపో డ్రైవర్ ఎం.శ్రీనివాసరావు మూడు కేటగిరీల్లో విజేతగా నిలిచి మూడు గోల్డ్ మెడల్స్ గెలిచాడు. పవర్ లిఫ్టింగ్ విభాగంలో 520 కేజీల బరువు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించాడు. హేమర్‌త్రో విభాగంలోనూ ప్రథమ స్థానం కైవసం చేసుకుని మరో బంగారు పతకం సాధించాడు. షాట్‌పుట్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి మరో గోల్డ్ మెడల్ కైవసం చేసుకుని భారత పతాకాన్ని విదేశాల్లో రెపరెపలాడించాడు. మూడు బంగారు పతకాలు సాధించి స్వదేశానికి తిరిగి వచ్చిన శ్రీనివాసరావుకు ఘన స్వాగతం లభించింది. ఆయనకు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

ఓటర్ల సవరణ జాబితా రూపకల్పనపై సమీక్ష

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 1: ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా-2025 రూపకల్పన కార్యకలాపాలపై మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈవో వివేక్ యాదవ్ అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షాన్‌మోహన్, ఎన్నికల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా-2025 రూపకల్పన కార్యకలాపాలకు సంబంధించి అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన ప్రక్రియ సక్రమంగా చేపట్టామన్నారు. సెప్టెంబరు 30 నాటికి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,637 పోలింగ్ కేంద్రాల పరిధిలో 16,34,513 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇప్పటి వరకు 98శాతం ఇంటింటా ఓటర్ల తనిఖీ పూర్తి చేశామన్నారు. మార్పులు, చేర్పులు, మరణాలకు సంబంధించి 10,608 దరఖాస్తులు అందాయని, వాటిని గడువులోపు పరిష్కరిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు జగన్నాథం, పలువురు అధికారులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ భారత్ దివస్'ను ఘనంగా నిర్వహించాలి

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 1: స్వచ్ఛ భారత్ దివస్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా పరిశుభ్రత, ఆరోగ్యం వెల్లివిరిసే భారతావని సాధనకు ప్రతి ఒక్కరూ కృతనిశ్చయంతో స్వచ్ఛభారత్‌లో చైతన్యంతో పాల్గొలన్నారు. పరిశుభ్రత సాధనలో సేవలు అందించిన పారిశుధ్య కార్మికులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలకు కృతజ్ఞతాపూర్వక సత్కారాలు నిర్వహించాలన్నారు. పట్టణ, పంచాయతీ వార్డులకు ర్యాంకింగ్ ఇచ్చి ఉత్తమ వార్డు ప్రజలకు అభినందనలు తెలియజేయాలన్నారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి అన్ని సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలన్నారు. స్వచ్ఛభారత్ ఆశయ సాధనలో కాకినాడ జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

లిక్కర్‌లో లక్కీ డ్రాప్స్

ఎవరికో 'లాటరీ'



- కొత్త ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటు కసరత్తు షురూ
- మంగళవారం ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ
- జిల్లాలో 155 దుకాణాల ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ
- ఈ నెల 9 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌ల్లో దరఖాస్తుల స్వీకరణ
- ఆఫ్‌లైన్ దరఖాస్తులను ఎక్కడికక్కడ ఎక్సైజ్ స్టేషన్లలో తీసుకునేలా ఏర్పాట్లు
- 11న కలెక్టర్ సమక్షంలో దుకాణాల వారీగా లాటరీ...
- ఆ వెంటనే అనుమతులు
- జిల్లాలో కేవలం పది దుకాణాలే రూ.55లక్షల ఫీజు కేటగిరీలోకి: మిగిలినవన్నీ రూ.65లక్షలే
- కాకినాడ నగరంలో అత్యధికంగా 36 దుకాణాలు
- ఈనెల 12 నుంచి కొత్త దుకాణాల్లో అన్ని రకాల మద్యం బ్రాండ్‌లు అందుబాటులోకి
- దరఖాస్తు, లైసెన్సు ఫీజు ద్వారా ప్రభుత్వానికి రూ.102.85 కోట్లు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో మందుబాబులను అయిదేళ్ల పాటు అడ్డంగా దోచేసిన జే-బ్రాండ్‌లకు ఇక చెల్లుచీటీయే. అడ్డగోలు బ్రాండ్లకు అడ్డదిడ్డం రేట్లు పిండేసిన రోజుల నుంచి నాణ్యమైన మందు తక్కువ ధరకే ఈ నెల 12 నుంచి అందుబాటులోకి రాబోతోంది. ఇన్నాళ్లూ మందుబాబుల ఆరోగ్యాన్ని దెబ్బతీసి కోట్లకు కోట్లు సంపాదించిన మాఫియాకు చెక్ పడబోతోంది. ఈ మేరకు జిల్లాలో ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్తగా ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. కొత్త దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ మంగళవారం మొదలైంది. ఈ నెల 9వ తేదీ వరకు ఎక్సైజ్ స్టేషన్లలో ఆయా మండలాల వారీగా దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈనెల 11న కలెక్టర్ సమక్షంలో లాటరీ తీసి దుకాణాలను అనుమతించనున్నారు. జిల్లాలో 155 దుకాణాలకు పదివేల నుంచి 50వేల వరకు జనాభా పరిధి ఉన్నవి పది షాపులే తేలాయి. వీటికి రూ.55 లక్షల ఫీజు నిర్ధారణ కాగా మిగిలిన అన్ని దుకాణాలు రూ.65 లక్షలు కేటగిరీలో వస్తున్నాయి. అత్యధికంగా కాకినాడ కార్పొరేషన్‌లో 36 వైన్‌షాపులు ఏర్పాటవబోతున్నాయి. మరోపక్క జిల్లాలో ఒక్కో మద్యం దుకాణానికి 25వరకు దరఖాస్తులు రావొచ్చని అంచనా వేస్తున్నారు.

జిల్లాలోని మందుబాబులకు ఐదేళ్ల నరకానికి త్వరలో విముక్తి లభించబోతోంది. మందు తాగాలని నోట్లో చుక్కేసుకుంటే దారుణమైన రుచి, వాసనతో ఇన్నాళ్లుగా మద్యం ప్రియులు పడ్డ బాధలకు ఈ నెల 12 నుంచి మోక్షం కలగబో తోంది. అన్ని రకాల ప్రముఖ బ్రాండ్లు ఇకపై తక్కువ ధరకే దొరకనున్నాయి. మద్యం కొత్త పాలసీ ప్రకారం జిల్లాలో పాత మద్యం దుకాణాలు రద్దు కాగా వాటి స్థానంలో ప్రైవేటు వైన్‌షాపులు ఏర్పాటు కాబోతున్నాయి. దీనికి సంబంధించి మంగళవారం జిల్లాలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. కొత్త పాలసీ ప్రకారం జిల్లాలో మొత్తం 171 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటిలో 16 దుకాణాలను కల్లు గీత కార్మికులకు కేటాయించడం కోసం మినహాయించారు. వీటికి మలిదశ కింద త్వరలో నోటిఫికేషన్ విడుదల కానుంది. వీటిని మినహాయించి మిగిలిన 155 మద్యం దుకాణాలకు జిల్లా ఎక్సైజ్ అధికారి కృష్ణకుమారి మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 9 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. దుకాణాల ఏర్పాటుకు ఆసక్తి కలిగిన వారి నుంచి ఆయా ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తులను స్వీకరించడం మొదలుపెట్టారు. ఈనెల 9 వరకు ఎవరైనా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో నాన్ రిఫండ్ కింద రూ.2లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా వచ్చిన దరఖాస్తులను ఈనెల 11న కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లోని వివేకానంద హాల్లో కలెక్టర్ సమక్షంలో ఒక్కో దుకాణానికి లాటరీ తీయనున్నారు. లాటరీ దక్కించుకున్న వారు ఈ నెల 12 నుంచి కొత్త దుకాణంలో మద్యం విక్రయించాల్సి ఉంటుందని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఐదేళ్ల తర్వాత మళ్లీ జిల్లాలో ప్రముఖ బ్రాండ్ల విక్ర యానికి అనుమతులు రావడం, ఐదేళ్లపాటు కొనసాగిన అడ్డగోలు ధరలకు కళ్లెం పడడం, అటు రూ.99కే చీప్ లిక్కర్ ఇవ్వాలని నిర్ణయించడంతో ఈసారి దుకాణాలకు డిమాండ్ భారీగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఒక్కో దుకాణానికి 25వరకు దరఖాస్తులు రావొచ్చని భావిస్తున్నారు. లాటరీ విధానంలో ఎంపిక కావడంతో అదృష్టాన్ని పరీక్షించుకోవడం కోసం చాలా మంది ముందుకు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆ కేటగిరీలోకి పది దుకాణాలే...

మండలం యూనిట్ ప్రాతిపదికగా తీసుకుని జిల్లాలో 155 దుకాణాల ఏర్పాటుకు జిల్లా ఎక్సైజ్ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా... ఇందులో అత్యధికంగా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏకంగా 36 షాపులు తెరుస్తున్నారు. అయితే దుకాణం లాటరీలో దక్కించుకున్నవారు ఫీజులను ఆరు వాయిదాల్లో చెల్లించాల్సి ఉంది. వాస్తవానికి పదివేల లోపు జనాభా ఉన్న గ్రామాల్లో లైసెన్సు ఫీజు రూ.50లక్షలు చెల్లించాల్సి ఉంది. 10వేల నుంచి 50వేల వరకు జనాభా ఉన్న చోట ఫీజు రూ.55లక్షలు, యాభైవేల నుంచి ఐదు లక్షల జనాభా ఉన్న చోట ఫీజు రూ.65లక్షలు చెల్లించాలి. జిల్లాలో పదివేల లోపు జనాభా ఉన్న గ్రామాలేవీ లేవు. పదివేల నుంచి యాభైవేల వరకు జనాభా కేటగిరీలో ఏలేశ్వరం మండలంలో మూడు, కోటనందూరులో రెండు, ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో మూడు, గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలో రెండు దుకాణాలు వస్తున్నాయి. మొత్తం 155 షాపుల్లో పది దుకాణాలు మాత్రమే రూ.55లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉండగా, మిగిలిన 145 మద్యం దుకాణాలు రూ.65లక్షల ఫీజు విభాగంలోకి వస్తున్నాయి. తద్వారా 145 దుకాణాల లైసెన్సు ఫీజు రూపంలో ప్రభుత్వానికి ఏడాదికి రూ.94.25కోట్లు రానుంది. అటు రూ.55లక్షల ఫీజు చొప్పున పది దుకాణాల ద్వారా రూ.5.50కోట్లు, 155దుకాణాలకు దరఖాస్తుల ద్వారా రూ.3.10 కోట్లు ప్రభుత్వ ఖజానాకు జమకానుంది. ఇలా మొత్తం అంతా కలిపి రూ.102.85కోట్లు సమకూరనుంది.



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎంకే కుమారి

లాటరీలో మద్యం దుకాణాలు దక్కించుకున్నవారిపై అడుగడుగునా నిఘా ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎమ్మార్పీ ఉల్లంఘించి మద్యం విక్రయిస్తే తక్షణం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ప్రతి దుకాణంలో రెండు సీసీ కెమెరాల ఏర్పాటును తప్పనిసరి చేసింది. గుడి, బడికి సమీపంలో ఒక్క దుకాణం కూడా ఏర్పాటు కావడానికి వీల్లేదు. దుకాణం దక్కించుకున్న వ్యక్తి మండలంలో నచ్చిన చోట షాపు ఏర్పాటు చేసుకోవచ్చు. పర్మిట్‌రూంలు, బెల్ట్‌షాపులకు అనుమతి ఇవ్వలేదు. గుట్టుగా నాణ్యత లేని మందు విక్రయించినట్టు తేలినా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది.

రావి ఆకుపై గాంధీజీ చిత్రాలు






రావి ఆకుపై గాంధీ చిత్రం చెక్కిన ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు

గొల్లప్రోలురూరల్, అక్టోబరు 1: జాతిపిత మహాత్మాగాంధీ చిత్రాన్ని రావి ఆకుపై చెక్కారు కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పిల్లి గోవిందరాజులు. లీఫ్ కార్వింగ్ కళ ద్వారా రావి ఆకుపై గాంధీజీ చిత్రాన్ని చిత్రించి దానిని చెక్కారు. బాపూజీ చేసిన దేశానికి చేసిన సేవలు, ఉద్యమం గురించి విద్యార్థులకు వివరించారు. గోవిందరాజులును ఎంఈవోలు వెంకటేశ్వరరావు, శివప్రసాద్, హెచ్ఎం సురేష్‌కుమార్‌లు అభినందించారు.

వాటర్ కలర్స్‌తో..



రాయవరం: జాతిపిత గాంధీజీ పుట్టిన రోజును పురస్కరించుకుని రాయవరం గ్రామానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు ఇందుగమెల్లి సౌదాగర్ రెండు గంటలు శ్రమించి వాటర్ కలర్స్‌ను ఉపయోగించి రావి ఆకుపై గాంధీజీ చిత్రాన్ని చిత్రీకరించాడు.

రావి ఆకుపై చిత్రకారుడు సౌదాగర్ చిత్రించిన గాంధీజీ చిత్రం

రాగులు, ఇసుక, చోళ్లు, కాఫీ పౌడర్‌తో..



అంగర విద్యార్థినులు రూపొందించిన గాంధీజీ చిత్రపటాలు



గాంధీజీ చిత్రపటాన్ని రూపొందిస్తున్న అంగర పాఠశాల విద్యార్థినులు

కపిలేశ్వరపురం: అంగర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాగులు, ఇసుక, చోళ్లు, కాఫీ ఫౌడర్‌తో గాంధీజీ చిత్రాలను చిత్రీకరించారు. పాఠశాల చిత్రలేఖనం ఉపాధ్యాయుడు దాసర వెంకటేష్ పర్యవేక్షణలో విద్యార్థునులు గాంధీజీ చిత్రాలు చిత్రీకరించారు. పాఠశాల హెచ్ఎం ఎ.రాజు విద్యార్థులను అభినందించారు.

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- రూ.70లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- 40కు పైగా కేసుల్లో ఉన్న నలుగురు సభ్యుల ముఠా
- కిమ్స్ వెంకటేశ్వరాలయం కేసు ఛేదించిన పోలీసులు
- చోరీ సొత్తు బంగారం, వెండి మొత్తం రికవరీ
- కేసు ఛేదించిన పోలీసులకు రివార్డులు అందించిన ఎస్పీ
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ కృష్ణారావు



కిమ్స్ వెంకటేశ్వరాలయంలో చోరీకి గురైన ఆభరణాలను రికవరీ చేసి చూపిస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): జల్సాలు, చెడు వ్యసనాలకు అలవాటు పడి వివిధ రాష్ట్రాల్లో భారీగా దొంగతనాలు, దోపిడీలకు పాల్పడ్డ నలుగురు సభ్యుల అంతర్‌రాష్ట్ర ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.70లక్షల విలువైన చోరీ సొత్తును డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉభయ రాష్ట్రాల్లో 40కు పైగా చోరీలకు పాల్పడ్డ ఈ ముఠాను తొలిసారిగా అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు వెల్లడించారు. ఈ కీలక కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం అమలాపురంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వివరించారు. అమలాపురం పట్టణానికి సమీపంలో ఉన్న కిమ్స్ వైద్య కళాశాలలో గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గతనెల 4వ తేదీ అర్ధరాత్రి జరిగిన భారీ చోరీ కేసును పోలీసులు ఛేదించి నిందితులను నుంచి సుమారు రూ.70లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. 868 గ్రాముల బంగారు ఆభరణాలు, 8.56 కిలోల వెండి ఆభరణాలను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ చెప్పారు. కిమ్స్‌లోని వేంకటేశ్వరాలయంలో చోరీ సొత్తు మొత్తం నిందితుల నుంచి రకవరీ చేసిన పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. శ్రీకాకుళం జిల్లా గుర్రాలమెట్ట గ్రామానికి చెందిన సవర సూర్యం అలియాస్ సూర్య (25), సవర చిన్నారావు అలియాస్ చిన్నా (24), జోగివలస గ్రామానికి చెందిన సవర రజనీ (24), తెలంగాణా రాష్ట్రంలోని మెదక్ జిల్లా మీమ్‌పూర్ గ్రామానికి చెందిన బత్తిన శ్రీకాంత్ (25) ఒక బృందంగా ఏర్పడి ఉభయ రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల్లో భారీగా దేవాలయాలను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడుతున్నారు. చెడు వ్యసనాలు, జల్సాలకు అలవాటు పడ్డ వీరు వ్యూహాత్మకంగా ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి పక్కా వ్యూహంతో దోపిడీలు చేయడం అలవాటు చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులు ఒక కారును అద్దెకు తీసుకుని చోరీ చేయాలనుకున్న దేవాలయాలవద్ద ముందుగా రెక్కీ నిర్వహించి ఆ తరువాత చోరీకి పాల్పడుతుంటారు. ఈవిధంగా అమలాపురంలోని కిమ్స్‌లోని వెంకటేశ్వరాలయానికి వచ్చి రెక్కీచేసి గతనెల 4వ తేదీ రాత్రి భారీ చోరీకి పాల్పడ్డారు. సాంకేతిక పరిజ్ఞానంతో అత్యంత చాకచక్యంగా ఈ దోపిడీకి పాల్పడ్డ ముఠాను గుర్తించడంలో క్రైమ్ పోలీసులు చేసిన కృషి ప్రశంసనీయం. అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ నేతృత్వంలో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు, మరో సీఐ ప్రశాంత్‌కుమార్, రూరల్ ఎస్ఐ వై.శేఖర్‌బాబుతోపాటు మరికొందరు పోలీసులను మూడు బృందాలుగా ఏర్పాటు చేసి నెలరోజుల వ్యవధిలోనే కిమ్స్ దోపిడీ కేసును ఛేదించి సొత్తు రికవరీ చేశారు. నిందితుల నుంచి 868 గ్రాముల బంగారం, 8.56 కిలోల వెండి, హ్యూండాయ్ వెర్నా కారు, నాలుగు మొబైళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. ఈ ముఠా సభ్యులు శ్రీకాకుళం జిల్లాలో 37, విశాఖపట్నం సిటీలో ఒకటి, ప్రకాశం జిల్లాలో ఒకటి, గుంటూరు జిల్లాలో ఒకటి, తెలంగాణాలోని మెదక్ జిల్లాలో ఒకటి దొంగతనాలు, దోపిడీలకు పాల్పడినట్టు ఎస్పీ కృష్ణారావు చెప్పారు. అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకోవడంలో కీలక పాత్ర వహించిన సీఐలు వీరబాబు, డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ శేఖర్‌బాబు, ఏఎస్ఐ అయితాబత్తుల బాలకృష్ణ, క్రైమ్ పార్టీ సభ్యులను ఎస్పీ కృష్ణారావు ప్రత్యేకంగా అభినందించారు. వీరందరికీ క్యాష్ రివార్డులను ఎస్పీ అందించారు. చాకచక్యంగా నెలరోజుల వ్యవధిలోనే భారీ దోపిడీ కేసులను ఛేదించిన పోలీసులను ప్రజలు అభినందిస్తున్నారు.

వినాయక నిమజ్జన ఊరేగింపు దాడిలో

21 మందికి రిమాండ్

కొవ్వూరు, అక్టోబరు 1 : కొవ్వూరు పట్టణంలో వినాయకుడి నిమజ్జన ఊరేగింపులో శ్రీరామకాలనీ, రాజీవ్‌కాలనీవాసుల మధ్య దాడికి కారణమైన 21 మందిని అరెస్టుచేసి రిమాండ్ నిమిత్తం జైలుకు పంపించినట్లు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు పట్టణంలోని రాజీవ్‌కాలనీకి చెందిన వినాయకుడి విగ్రహం నిమజ్జన ఊరేగింపులో శ్రీరామకాలనీ వద్ద జరిగిన రాళ్ల దాడికి సంబంధించి ఇరువర్గాలకు మొదటి దఫాగా కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. సెప్టెంబర్ 30న కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ శ్రీరామకాలనీ వాసులపై జరిగిన దాడికి సంబంధించి నమోదుచేసిన ఎస్సీ, ఎస్టీ కేసులో రాజీవ్‌కాలనీకి చెందిన 15 మందిని అరెస్టు చేశారు. అదేవిధంగా రాజీవ్‌కాలనీవాసులు అందించిన ఫిర్యాదుమేరకు నమోదు చేసిన కేసులో ఆరుగురిని అరెస్టు చేశారు. మొత్తం 21 మందిని మంగళవారం కొవ్వూరు 2వ అదనపు జ్యుడీషియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించడంతో 21 మందిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. శ్రీరామకాలనీ, రాజీవ్‌కాలనీలలో శాంతియుత వాతావరణం నెలకొనే వరకు పికెటింగ్‌లు కొనసాగిస్తున్నట్లు సీఐ విశ్వం తెలిపారు. ఈ కేసులకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతుందని, విచారణ అనంతరం మరికొంత మందిని అరెస్టు చేసే అవకాశం ఉందన్నారు.

విధుల్లో చేరిన మునిసిపల్ డీఈఈ

- సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు చేసిన హైకోర్టు



కమిషనర్‌కు జాయినింగ్ రిపోర్టు ఇస్తున్న డీఈఈ భవానీశంకర్

పిఠాపురం, అక్టోబరు 1: కాకినాడజిల్లా పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో డీఈఈగా పనిచేస్తున్న భవానీశంకర్ హైకోర్టు ఉత్తర్వులతో మంగళవారం తిరిగి విధుల్లోకి చేరారు. ఆగస్టు 31వ తేదీన జరిగిన పిఠాపురం మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్‌సభ్యులు సాక్షిగా కమిషనరు కనకారావు, డీఈ ఈ భవానీశంకర్‌లు పరస్పరం వాగ్వివాదం, తోపులాట, బాహాబాహికి దిగారు. దీనిపై అప్పట్లో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. జిల్లా కలెక్టరు నివేదిక ఆధారంగా డీఈఈ భవానీశంకర్‌ను అదేరోజు రాత్రి సస్పెండ్ చేస్తూ పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై భవానీశంకర్ హైకోర్టును ఆశ్రయించారు. తన వివరణ తీసుకోకుండా అన్యాయంగా సస్పెండ్ చేశారని హైకోర్టుకు విన్నవించారు. దీనిపై స్పందించిన హైకోర్టు ఇంజనీర్ ఇన్ చీఫ్ జారీచేసిన ఉత్తర్వులను పక్కన పెడుతూ ఉత్తర్వులు ఇచ్చింది. హైకోర్టు ఆదేశాలతో డీఈఈ భవానీశంకర్ విధుల్లో చేరుతూ కమిషనర్ కనకారావుకు జాయినింగ్ రిపోర్టును అందజేశారు. అనంతరం డీఈఈగా బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు ఉత్తర్వులతో డీఈఈ విధుల్లో చేరారని కమిషనర్ ధ్రువీకరించారు.

రత్నగిరిపై శరన్నవరాత్రికి సర్వం సిద్ధం

- 12న శమీపూజ. రావణసంహారం కార్యక్రమాలు
- 3 నుంచి 12 వరకు రోజుకొక అలంకారంలో అమ్మవారు

అన్నవరం, అక్టోబరు 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శరన్నవరాత్రి వేడుకలకు అధికారులు సర్వంసిద్ధం చేస్తున్నారు. ఈనెల 3 నుంచి 12 వరకు ఈ వేడుకలు జరుగనుండగా వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఉదయం నుంచి విశేషపూజలు, సాయంత్రం కుంకుమార్చనలు నిర్వహిస్తారు. చివరిరోజైన 12వ తేదీన రాత్రి 7 గంటలకు శమీపూజ, దేవస్థానం హైస్కూల్ ప్రాంగణంలోను, 8గంటలకు రావణసంహారం కార్యక్రమం దేవస్థానం కళాశాల మైదానంలో చేపట్టనున్నట్లు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

నవోదయలో 9, 11 తరగతుల్లో

ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం, అక్టోబరు 1: స్థానిక జవహర్ నవోదయాలో 2025-26 విద్యా సంవత్సరంలో 9, 11 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ప్రస్తుత విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదువుతూ 1.5.2010 నుంచి 31.7.12 తేదీల మధ్య జన్మించి ఉండాలన్నారు. 11వ తరగతిలో ప్రవేశం పొందే అభ్యర్థులు ప్రస్తుత విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదువుతూ 1.6.2008 నుంచి 31.7.2010 మధ్య జన్మించి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30న చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 8వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాలకు

స్పాట్ కౌన్సెలింగ్

- నన్నయ వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, అక్టోబరు1 : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన ఎంబీఏ, ఎంబీఏ (టూరిజం అండ్ హాస్పిటాలిటీ), ఎంసీఏ కోర్సుల్లోని భర్తీ కాని సీట్లకు ఈనెల 5న స్పాట్ కౌన్సెలింగ్ జరుగుతుందని వీసీ వై.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఏపీఐసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఇక్కడి ప్రాంగణంతోపాటు తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌లలో సంబంధిత సీట్లు భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు. విశ్వవిద్యాలయంలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు ఉదయం 9-30నుంచి 11గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డి.జ్యోతిర్మయి పర్యవేక్షిస్తారని చెప్పారు. సీట్లు, ఫీజు వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చునని తెలిపారు.

90వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న పోలిశెట్టి తాతీలు

కరప, అక్టోబరు 1: జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు 90వ సారి రక్తదానం చేశారు. కాకినాడ అభయ బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం రక్తదానం చేసినట్టు ఆయన తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి స్ఫూర్తితో గత 30ఏళ్లగా మిత్రులతో కలిసి రక్తదానం చేస్తున్నట్టు వివరించారు. అలాగే కరప గ్రామానికి చెందిన దేవు మాణిక్యాలరావు(మిఠాయికొట్టు బాబీ) తన కుమార్తె మణిఐశ్వర్యదేవి పుట్టినరోజు సందర్భంగా 19వ సారి రక్తదానం చేశారు.

గాంధీ జయంతి రోజున పాఠశాలలు పనిచేయాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

- ఏపీటీఎఫ్ డిమాండ్

కొవ్వూరు, అక్టోబరు 1 : అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతిని పురస్కరించుకుని తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని పాఠశాలలు పనిచేయాలని ఇచ్చిన ఉత్తర్వులపై ఏపీటీఎఫ్ తీవ్ర అభ్యతరం తెలిపింది. ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దసరా పండుగను అక్టోబరు 3వ తేదీ నుంచి పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తుందని 10 రోజుల ముందునుంచే వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో అక్టోబరు 2న గాంధీ జయంతి సెలవు కూడా కలిసి వస్తోందని భావించి ఎంతోమంది ఉపాధ్యాయులు, ప్రయాణాలు, కార్యక్రమాలు పెట్టుకున్నారు. అకస్మాత్తుగా విద్యాశాఖ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడాలేని విధంగా ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే గాంధీ జయంతి రోజున అన్ని పాఠశాలలు పనిచేయాలని ఉత్తర్వులు విడుదల చేయడాన్ని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.దుర్గారావు, పి. సువర్ణరాజులు అభ్యంతరం తెలిపారు. తక్షణం విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పట్టా భూముల్లోనూ ఇసుక తీతలు



గాయత్రీ ర్యాంపులో బోట్స్‌మన్ సొసైటీ సభ్యులతో జేసీ చినరాముడు

- ఓపెన్ ర్యాంపులకు టెండర్లు పిలిచే యోచన
- మొక్కుబడిగా మొదలైన ఇసుకతీత
- ఇంకా అయోమయంలోనే బోట్స్‌మెన్ సొసైటీలు
- గాయత్రీ రెండు ర్యాంపులకు కొలతలు
- అనుమతి మేరకు ఇసుక తీయాలి: జేసీ చినరాముడు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి):

ఇక ఇసుక కొరత కొద్దిరోజులు మాత్రమే. పట్టా భూముల్లో కూడా ఇసుక తీతకు అనుమతిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో గోదావరి లంకల్లోని పట్టా భూముల్లో ఇసుక కూడా తీసి ఉచిత ఇసుక విధానంలో సరఫరా చేయవచ్చు. బహుశా ఈనెల 15 తర్వాత ఓపెన్ ర్యాంపులు కూడా అమల్లోకి వచ్చే అవకాశముంది. ప్రస్తుతం బోట్స్‌మెన్ సొసైటీల ద్వారా డీసిల్టేషన్ కూడా మొదలవుతోంది. ఇవన్నీ మొదలైతే జిల్లాలో ఇసుక కొరత అనేదే ఉండదు. ఇతర ప్రాంతాలకు కూడా సరఫరా చేసే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం డీసిల్టేషన్ పాయింట్లలో ఇసుక తీత ఇంకా అయోమయంలోనే ఉంది. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు ఆధ్వర్యంలో ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్, ఇరిగేషన్ హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, మైన్స్ ఏజీ విఘ్నేష్, అర్బన్ తహశీల్దార్ పీహెచ్ పాపారావు, డీఈఈలు, గాయత్రీ ర్యాంపులను పరిశీలించారు. బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులతో మాట్లాడారు. ఇసుకతీత వెంటనే ప్రారంభించాల్సిన అవసరాన్ని వివరించారు. గాయంత్రీ 1, 3 ర్యాంపులను ఒక ర్యాంపుగానూ, 2, 4 ర్యాంపులను మరో ర్యాంపుగానూ గుర్తించి కొలతలు వేయించారు. కానీ అక్కడ ఇప్పటికే సుమారు 20 బోట్స్‌మెన్ సొసైటీలకు అనుమతిచ్చారు. కానీ ఏ పాయింట్‌లో ఎవరు ఇసుక పోగుపెట్టాలనేది స్పష్టం చేయలేదు. అధికారుల సూచన మేరకు కొందరు సుమారు 15వేల టన్నుల ఇసుకను తీసి గుట్టపెట్టారు. రేపోమాపో మరికొందరు ఇసుక తీస్తారు. కానీ వీరంతా ఇసుక ఎక్కడ వేయాలనేది కూడా స్పష్టత లేకపోవడంతో అందరూ అయోమయంలో పడ్డారు. వీరికి డబ్బు ఎవరిస్తారనేది కూడా ఇంకా స్పష్టత లేదు. ఈనెల 11వ తేదీ తర్వాత బోట్స్‌మెన్ సొసైటీలన్నింటి ద్వారా ఇసుక తీయించడానికి ఓ ఏజెన్సీ వస్తుందనే ప్రచారం ఉంది. అప్పటివరకూ ఈ ఇసుక తీత ఓ తతంగం మాదిరిగానే ఉండవచ్చనే అంచనా ఉంది. త్వరలో ఓపెన్ ర్యాంపులు కూడా అమలులోకి రానున్నాయి. అవి సుమారు 31 వరకూ ఉండవచ్చు. వాటి నిర్వహణకు టెండర్లు పిలిచే ఆలోచన కూడా ఉన్నట్టు సమాచారం.

అనుమతి మేరకు ఇసుక తీయాలి: జేసీ చినరాముడు

ప్రభుత్వం ఇచ్చిన అనుమతి మేరకు ఇసుక తీత, సరఫరా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చినరాముడు చెప్పారు. గాయత్రీ ర్యాంపులను పరిశీలించిన ఆయన బోట్స్‌మెన్ సొసైటీ సభ్యులతో మాట్లాడారు. మంగళవారం 15వేల టన్నుల ఇసుక తీసినట్టు బోట్స్‌మెన్ సొసైటీలు చెప్పాయి. ఈ ర్యాంపుల నుంచి రెండు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉంటుందని అధికారులు జేసీకి తెలిపారు. ప్రతిరోజూ ఇసుక సరఫరా సామర్థ్యాన్ని పెంచాలని జేసీ ఆదేశించారు.

మన్యంలో మద్యం షాపులన్నీ స్థానిక గిరిజనులకే!

- అన్ని షాపులకూ పీసా గ్రామసభల ఆమోదం తప్పనిసరి
- 40 షాపులకు నోటిఫికేషన్ జారీ చేసిన అల్లూరి కలెక్టర్



రంపచోడవరం, అక్టోబరు1: మన్యంలోని మద్యం షాపులన్నీ స్థానికంగా ఉండే గిరిజనులకే ఇవ్వాలని ప్రభుత్వం నిశ్చయించి 2024-26కు రూపొందించిన మద్యం విధానంలో నిర్దేశించింది. ఈమేరకు రూపొందించిన నిబంధనలలో గిరిజన ప్రాంతాలకు సంబంధించి మార్గదర్శకాలను ఖరారు చేసింది. అల్లూరి జిల్లాలోని రంపచోడవరం, చింతూరు, పాడేరు డివిజన్లలో మొత్తంగా 40మద్యం షాపులకు మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆమోదంతో గెజిట్ నోటిఫికేషన్ జారీ అయింది. ప్రభుత్వం మద్యం విధానాన్ని రూపొందించడంలోనే గిరిజన ప్రాంతాలకు సంబంధించి అనుసరించాల్సిన మార్గదర్శకాలను గిరిజన ప్రాంతాల చట్టాలను దృష్టిలో ఉంచుకుని ఖరారు చేసింది.

పీసా నిబంధనల ప్రకారం కేటాయింపు

గిరిజన ప్రాంతాలకు కేటాయించిన షాపులన్నిటికీ గిరిజన ప్రాంతాల పంచాయతీరాజ్ చట్టం(పీసా) నిబంధనల ప్రకారం ఆయా గ్రామసభల నుంచి షాపుల ఏర్పాటుకు ఆమోదాలను తీసుకోవాల్సి ఉంటుంది. గ్రామసభల నుంచి నాలుగు వారాలలో ఆమోదం లభించని పక్షంలో, నాలుగువారాల అనంతరం దానిని ఆమోదం లభించినట్టుగానే భావించాల్సి ఉంటుందని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఇక్కడ షాపులన్నీ స్థానికంగా ఉండే గిరిజనులకే కేటాయించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

షాపుల వివరాలు

రంపచోడవరం డివిజన్లో రంపచోడవరంలో రెండు, దేవీపట్నంలో ఒకటి, వై.రామవరంలో ఒకటి, అడ్డతీగలలో రెండు, గంగవరంలో ఒకటి, మారేడుమిల్లిలో ఒకటి, రాజవొమ్మంగిలో రెండు, చింతూరులో మూడు, ఎటపాకలో రెండు, కూనవరంలో ఒకటి, వి.ఆర్.పురంలో రెండు చొప్పున మద్యం షాపులను కేటాయిస్తూ కలెక్టరు నోటిఫై చేశారు. రంపచోడవరం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు పరిధిలోని షాపులకు రంపచోడవరంలోనూ, చింతూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు పరిధిలోని షాపులకు చింతూరు లోనూ దరఖాస్తులను దాఖలు చేసుకోవచ్చు. ఈనెల 11న పాడేరులోని ఎస్పీ కార్యాలయం సమీపంలోని వి.ఆర్.ఫంక్షన్ హాల్‌లో లాటరీ పద్ధతిన అన్నిషాపులకు లైసెన్సులను మంజూరు చేస్తారు.

హైవేల మీద, గుడి, బడి పక్కనా

మద్యం షాపులు ఉండొద్దు

- మద్యం విధాన నిబంధనల్లో రాజీపడని కూటమి ప్రభుత్వం

జాతీయ రహదారులపైనా, రాష్ట్ర హైవేలపైనా, గుడిపక్కనా, బడిపక్కనా మద్యం షాపులు ఉండొద్దని కూటమి ప్రభుత్వం తేల్చిచెప్పింది. 2024-26 మద్యం విధానంలో ఎక్కడా కూడా హైవేలపైనా, గుడులు, బడులపైనా ఎక్కడా మద్యం షాపులు ఉండ కుండా నిర్దిష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. హైవేల ను ఆనుకుని కనుచూపు మేరలో ఎక్కడా కూడా మద్యం షాపులు ఉండొద్దని, జాతీయ రహదారి, స్టేట్ హైవేను ఆనుకుని 500 మీటర్ల పైబడిన ప్రాంతంలోనే ఈ షాపులను నెలకొల్పాలి. ఈ విధంగా మన్యం మీదుగా రాజమహేంద్రవరం నుంచి అరకు జాతీయ రహదారి పైనా, భద్రాచలం హైవేపైనా ఎక్కడా షాపులకు అవకాశం లేదు. 500 మీటర్ల లోపలకు షాపులను నెలకొల్పుకోవచ్చు. గుడులు, బడులు ఉన్నచోట 100 మీటర్ల పైబడి ఎక్కడా షాపులు ఉండరాదని నిబంధనల్లో పేర్కొంది.

దారి దోపిడీకి పాల్పడిన ఏడుగురి అరెస్టు

- రూ.1.70 లక్షల నగదు, రెండు బైక్‌లు స్వాధీనం

నరసాపురం, అక్టోబరు 1: మండలంలోని సీతారాంపురం టోల్ ప్లాజా సమీపంలో సోమవారంరాత్రి ఓ చిరు వ్యాపారిని కొట్టి రూ.2లక్షలు దోపిడీకి పాల్పడిన కేసు మిస్టరీని పోలీసులు కొద్ది గంటలోనే ఛేదించారు. తోటి వ్యాపారిని ఆర్థికంగా దెబ్బతీయాలన్న అక్కసుతోనే ఇదే వ్యాపారం చేస్తున్న మరో ఇద్దరు ఐదుగురు కిరాయి వ్యక్తులతో ఈ దోపిడీకి పాల్పడినట్లు అదనపు ఎస్పీ మురళీకృష్ణ చెప్పారు. మంగళవారం సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామానికి చెందిన రాపాక చంద్రరావు విదేశీ వస్తువుల విక్రయిస్తుటాడు. దీంతో పాటు విదేశాల నుంచి వచ్చిన వారి నుంచి కరెన్సీ కొనుగోలుచేసి వాటిని వెస్ట్రన్‌మనీ సెంటర్లలో అమ్ముతుంటాడు. ఇదే ప్రాంతానికి చెందిన మేడిద వెంకటరెడ్డి, మానిక్యాబాబులు కూడా ఇదే వ్యాపారం చేస్తుంటారు. అయితే చంద్రరావు వ్యాపారం స్పీడ్‌గా ఉండడంతో అతన్ని ఆర్థికంగా దెబ్బతీయాలని ఇద్దరు స్కెచ్ వేశారు. కోనసీమ జిల్లా రాజోలు ప్రాంతానికి చెందిన ఆకుల ప్రభుతేజ, సాధనాల మణికంఠ, భయ్యా హేమసాగర్, కోరుకొండ గిరిబాబు, గంటారాజు, మలికిబాబులను పురమాయించి రెండు లక్షలు విలువైన విదేశీ కరెన్సీ నోట్లు ఉన్నాయంటూ చంద్రరావుకు ఫోన్ చేయించారు. సీతారంపురం సమీపంలోని రాజుగారితోట టోల్ ప్లాజా వద్దకు వస్తే అందజేస్తామని నమ్మించారు. ఇది నిజమని భావించిన చంద్రరావు డబ్బుతో అక్కడికి చేరుకున్నాడు. అప్పటికే అక్కడ మాటు వేసిన కిరాయి వ్యక్తులు అయిగురు చంద్రరావుపై దాడి చేశారు. తెచ్చిన నగదు రూ.2 లక్షలు దోచుకుపోయారు. వెంటనే తేరుకున్న చంద్రరావు మొగల్తూరు పోలీసుల్ని ఆశ్రయించడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టగా, వెంకటరెడ్డిపై అనుమానం వచ్చిందన్నారు. లోతైన విచారణ చేయగా మొత్తం కేసు మిస్టరీ వీడిందన్నారు. మంగళవారం ఉదయం నిందితులంతా పట్టణంలోని ఓ లాడ్జీలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.1.75 లక్షల నగదు,రెండు బైక్‌లు, పది విదేశీ కరెన్సీనోట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సమావేశంలో సీఐలు యాదగిరి, ప్రసాద్, ఎస్సై వాసులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు

- పంచారామంలో ఏర్పాట్లు పూర్తి

సామర్లకోట, అక్టోబరు 1: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామభీమేశ్వరాలయంలో ఉన్న బాలాత్రిపుర సుందరి అమ్మవారి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు మూడో తేదీ గురువారం నుంచి 12 తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఆలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లు చేయడమేగాక జిల్లా, రాష్ట్రం నలుమూలల నుంచీ ఆలయానికి వచ్చే భక్తులకు నిత్యాన్నదాన పథకం ద్వారా అన్నప్రసాదాలను అందించేందుకు ఏర్పాట్లూ పూర్తిచేశారు. 3న గురువారం ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, ఆచార్యులు, రక్షాబంధనము, కలశస్థాపన నిర్వహించనున్నారు. నవరాత్రి జరుగు తొమ్మిదిరోజులూ ఉదయం 8 గంటల నుంచి దుర్గాసప్తశతిపారాయణ, బాలాపరమేశ్వరీ మంత్రజపములు నిర్వహిస్తారు.

వృద్ధురాలిని బండి ఎక్కించుకుని.. పించన్ సొమ్ము లాక్కొని..

పరారైన అగంతుకుడు

- గాయపడిన వృద్ధురాలు



గాయపడ్డ వృద్ధురాలికి తిరిగి పెంచన్ అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

పిఠాపురం, అక్టోబరు 1: వృద్ధురాలిని గాయపరిచి పించన్ సొమ్ము లాక్కొని అగంతకుడు పరారయ్యాడు. ఈ సంఘటన కాకినాడ జిల్లా పిఠాపురంలోని జగ్గయ్యచెరువుకాలనీలో మంగళవారం జరిగింది. గొల్లపేటకు చెందిన గోపాలపు అనంతలక్ష్మి కాలనీలోని 11వ వార్డు సచివాలయం పింఛన్ తీసుకునేందుకు వచ్చింది. సిబ్బంది ఇచ్చిన రూ.4వేలును తీసుకుని బయటకు రాగానే ఒక ఆగంతకుడు వచ్చి మీ ఇంటివైపే వెళుతున్నాను దిగబెడతాను అని మోటార్‌సైకిల్ ఎక్కించుకున్నాడు. ఇంటి దగ్గర దింపకుండా మండలపరిషత్ కార్యాలయం సమీపం రోడ్డులోకి తీసుకువెళుతుండటంతో వృద్ధురాలు ప్రశ్నించింది. దీంతో వృద్ధురాలిని మోటార్‌సైకిల్‌పై నుంచి తోసేసి ఆమె వద్ద ఉన్న రూ.4వేలను తీసుకుని అగంతకుడు పరారయ్యాడు. కిందపడిపోయిన వృద్ధురాలికి ముఖంపై గాయాలయ్యాయి. వెనుక స్కూటీపై వస్తున్న వ్యక్తి సదరు అగంతకుడిని పట్టుకునేందుకు ప్రయత్నించినా దొరకలేదు. దీంతో వృద్ధురాలు అక్కడే కూర్చుండిపోయింది. స్థానికులు ఆమె కు సపర్యలు చేశారు. సీసీ కెమేరా దృశ్యాలు ఆధారంగా పట్టణ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న మునిసిపల్ కమిషనర్ కనకారావు తన స్వంత సొమ్ము రూ.4వేలను సచివాలయ సిబ్బంది ద్వారా ఆ వృద్ధురాలికి అందజేశారు.

మాకు న్యాయం చేయాలి

- మద్యం షాపుల కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన
- మద్యం దుకాణాల మూసివేత
- బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయాలు



అనపర్తిలోని ప్రభుత్వ మద్యం దుకాణం మూసివేసి నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

అనపర్తి, అక్టోబరు 1: ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మంగళవారం షాపులను మూసివేసి నిరసన తెలిపారు. గతనెల 30వ తేదీతో తమ గడువు ముగిసిందని తమ భవిష్యత్ అంధకారంగా మారిందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తమ అర్హతను బట్టి మద్యం డిస్పెన్సరీలలోగానీ మరోచోటగాని పని కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈనెల 12 నుంచి ప్రైవేటు షాపులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వీరంతా షాపులను మూసివేసి నిరసన తెలుపుతున్నారు. వీరి సమ్మెతో మద్యం దొరకదని గ్రహించిన మందుబాబులు బ్లాక్ మార్కెట్ వైపుకు పరుగులు పెట్టడంతో నిర్వాహకులు మద్యం ధరలు పెంచేశారు. ఫుల్ బాటిల్‌కు రూ.500, క్వార్టర్‌కు రూ.100-150 అదనంగా వసూలు చేస్తున్నారు. సాయంత్రం 7గంటల సమయంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల యూనియన్ నుంచి వచ్చిన సమాచారంతో అనపర్తి కెనాల్ రోడ్డులోని షాపును తెరవడంతో మందు బాబులు ఎగబడ్డారు. ఈనెల 5వ తేదీ వరకు వేచి చూడాలని రాష్ట్ర యూనియన్ ఇచ్చిన సమాచారం మేరకు అక్కడక్కడా షాపులు తెరుచుకున్నట్టు సమాచారం.

కాకినాడ

'జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం'

కాకినాడ సిటీ, అక్టోబరు 1: ఇటీవల కేంద్ర కేబినెట్ ఆమోదించిన జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు పేర్కొన్నారు. కచేరీపేటలోని యూటీఎఫ్ టీచర్స్ హోమ్‌లో రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కన్వీనర్ ఐ.ప్రసాదరావు ఆధ్వర్యంలో 'జమిలి ఎన్నికలు -పర్యావసానాలు' అంశంపై సదస్సు నిర్వహించారు. సీఐటీయూ నగర కన్వీనర్ మలక వెంకటరమణ, స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్.గోవింరాజు ఉన్నారు.

హామీలను నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

» కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు » పింఛన్లు పంపిణీ చేసిన ప్రజాప్రతినిధులు

కాకినాడ సిటీ, అక్టోబరు 1: ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న ఘనత కూటమి ప్రభుత్వాదేనని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. మంగళవారం ఆయన 21వ డివిజన్‌లో లబ్ధిదారులకు పెన్షన్ అందజేశారు. రాబోయే రోజుల్లో అర్హులైన వారికి పెన్షన్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తెప్పల రామ లింగేశ్వరరావు, బూడి ప్రకాష్, దుర్గాప్రసాద్, ఆయేషా, గొరుసు దుర్గారావు, పసగడుగుల శేషగిరిరావు, ఇమామ్ సాహెబ్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ): నగరపాలక సంస్థ పరిధిలో పింఛన్ల పంపిణీ 97.84 శాతం పూర్తయిందని టీపీఆర్వో శైలజ తెలిపారు. నగరంలో మంగళవారం ఉదయం నుంచి పింఛన్ల పంపిణీని సచివాలయాల సిబ్బంది చేపట్టారు. నగరంలో 30,106మంది లబ్ధిదారులు ఉండగా సాయంత్రం 5.30 గంటల వరకు 29,455 మందికి పింఛను అందజేశారు. మొత్తం రూ.12.75 కోట్లకు రూ.12.47కోట్లు పంపిణీ చేశారు.

శంఖవరం: కత్తిపూడిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అందజేశారు. ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, మేడిశెట్టి సూర్యకిరణ్, వెన్నాశివ, ఉల్లి వీరబద్రరావు, బద్దిరామారావు, బచ్చల గంగ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: లింగంపర్తిలో టీడీపీ నాయకులు జ్యోతుల పెదబాబు, చిక్కాల లక్ష్మణరావు, పెంటకోట శ్రీధర్, నూకతాటి ఈశ్వరుడు ఫింఛన్లు అందజేశారు.

ప్రత్తిపాడు: మండలంలో 96శాతం పింఛన్ల పంపిణీ నిర్వహించారు. 11,702 లబ్ధిదారులుండగా మధ్యాహ్నం 2గంటలకే అత్యధికంగా పింఛన్లు అందజేసినట్టు ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు. ధర్మవరంలో టీడీపీ నాయకులు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, బొండాడ నారాయణ, బొల్లు వెంకటేశ్వరరావు పింఛన్లు పంపిణీ చేశారు.

కరప: మండలంలో 97శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. మండల పరిధిలో 11,461 మంది లబ్ధిదారులుండగా 11,136మందికి పింఛన్లు అందించామని, మిగిలినవారికి బుధవారం అందిస్తామన్నారు. కరప, నడకుదురు గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పింఛన్లను పంపిణీ చేశారు. టీడీపీ నేత నులుకుర్తి వెంకటేశ్వరరావు, మండలాధ్యక్షుడు దేవు వెంకన్న పలుగ్రామాల్లో అందజేశారు.

తొండంగి: దానవాయిపేటలో టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొయ్యా రామకేశవ, చొక్కా కాశీ, చొక్కా అప్పారావు తదితరులు ఉన్నారు.



కరపలో పింఛన్లు అందిస్తున్న డాక్టర్ చప్పిడి

బాలయోగికి ఘన నివాళి



తాళ్లరేవులో కూటమి నేతల నివాళి

తాళ్లరేవు, అక్టోబరు 1: దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతిని తాళ్లరేవులో కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. తాళ్లరేవు అంబేడ్కర్ భవనం, జార్జీపేట జమ్మిచెట్టు సెంటరు, నేరేళ్లలంక, సుంకరపాలెం సెంటర్లలో బాలయోగి వి గ్రహాలకు కూటమినేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మోపూరి వెంకటేశ్వరరావు, మందాల గంగసూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ, కట్టా త్రిమూర్తులు, వాడ్రేవు వీరబాబు, వేగేశ్న భాస్కర రాజు, అత్తిలి బాబూరావు, సూరంపూడి కుమార్, బండారు దొరబాబు, పోతుల రాజు, చిట్టూరి కలికిమూర్తి, వస్కా రెడ్డి, నడింపల్లి వినోద్, పిల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: యానాం రోడ్డులో గల బాలయోగి విగ్రహానికి కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. జన్మభూమి సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొడ్డు దేవరాజు, సీకోటి అప్పలకొండ, గుత్తుల రమణ, ఏంఏ తాజుద్దీన్, బలసాడి రంగారావు, అంబటి చిన్న, మేడిశెట్టి చిన్ని, పాలిక నాని, గొరుసు దుర్గారావు, పసగడుగుల శేషగిరిరావు, తెప్పల రామలింగేశ్వరావు, ఇమాం సాహెబ్, పీర్ల లక్ష్మీప్రసన్న, ఆయేషా పాల్గొన్నారు. కాకినాడలో టీడీపీ జిల్లా కార్యాలయంలో బాలయోగి జయంతి నిర్వహించారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల అప్పారావు, అంబటి చిన్న, బంగారు సత్యనారాయణ, డాక్టర్ చప్పిడి వెంక టేశ్వరరావు, కోనాల కృష్ణ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు : ఎస్పీ

కాకినాడ క్రైం, అక్టోబరు 1: దసరా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. గురువారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో రాత్రి నేరాల నియంత్రణకు ప్రత్యేకంగా గస్తీ, పెట్రోలింగ్, బీట్లను పెంచామన్నారు. కాకినాడలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక ఎస్ఐతో పాటు రాత్రి గస్తీ, పెట్రోలింగ్ చేసేందుకు పెట్రోలింగ్ వాహనాలను సిద్ధం చేశామన్నారు. దసరా సెలవుల్లో వివిధ ప్రాంతాలకు వెళ్లే లాక్డ్‌హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, దీనికోసం కాకినాడ పోలీస్ కంట్రోల్ రూమ్ 9494933233కు ఫోన్ చేయాలని కోరారు.

దొంగతనాల నివారణకు ప్రత్యేక నిఘా : సీఐ

ప్రత్తిపాడు, అక్టోబరు 1: దసరాకు ఊరువెళ్లితే పోలీసులకు చెప్పాలంటూ ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు కోరారు. మంగళవారం స్థానిక సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో దొంగతనాల నివారణకు ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. దసరా సందర్భంగా ఇళ్లకు తాళాలు వేసుకుని కుటుంబమంతా బంధువుల ఇళ్లకు, తీర్థయాత్రలకు వెళితే ఆ ఇం టి వివరాలను సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలన్నారు దసరా సెలవు రోజుల్లో తాళాలు వేసే ఇంటికి చోరీలు జరిగే అవకాశం ఉన్న దృష్ట్యా ఇళ్ల యజమానులు, అపార్టుమెంట్ల వారు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పోలీసులకు ముందస్తుగానే సమాచారం ఇవ్వడంతో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేస్తామని వివరించారు.

కాకినాడ సూపర్‌బజార్ చైర్మన్‌గా ఆదినారాయణ



కాకినాడ సిటీ, అక్టోబరు 1: ది కాకినాడ కన్స్యూమర్స్ మల్టీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ (సూపర్‌బజార్) చైర్మన్‌గా గ్రెసింగి ఆదినారాయణ ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు. మంగళవారం మెయిన్‌రోడ్‌లోని ప్రధాన కార్యాలయంలో సంస్థ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ముగ్గురు కొత్త డైరెక్టర్లతో ప్రమాణం చేయించిన అనంత రం చైర్మన్ ఎన్నిక జరిపారు. మూడేళ్ల వ్యవధికి చైర్మన్‌గా గ్రెసింగి ఆదినారాయణను తొమ్మిదిమంది పాలకవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంస్థ చీఫ్ ఎగ్జిక్యూ టివ్ ఆఫీసర్ వి.శివాజీగణేష్, ఎన్నికల అధికారి ఆర్ఎస్ సుధాకరరావు, వైస్ చైర్‌పర్సన్ వరిపల్లి కృష్ణవేణి, డైరెక్టర్లు యాళ్ల పట్టాభిరామయ్య, బత్తిన ఫైడిరాజు, మన్నే నాగేశ్వ రరావు, ముమ్మిడి పవన్‌కుమార్, డీవీ ప్రసాద్, బి.బాలకృష్ణ, డీవీ ఆదినారాయణ పాల్గొన్నారు.

ముగిసిన చెకుముకి సైన్స్ సంబరాలు

గొల్లప్రోలు, అక్టోబరు 1: గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పట్టణ, మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ముగిశాయి. సీనియర్స్ విభాగంలో చేబ్రోలు జిల్లా పరిషత్, గొల్లప్రోలు బాలుర ఉన్నత పాఠశాలలు.. జూనియర్స్‌లో ఏకేమల్లవరం, గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలు ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించాయి. విజేతలకు ఎంఈవోలు నాయుడు వెంకటేశ్వరరావు, శివప్రసాద్, జనవిజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు వి.సత్యనారాయణ రెడ్డి, దాడి పద్మనాభం బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో విజేతలు ఈనెల 27వ తేదిన జరిగే జిల్లా స్థాయి చెకుముకి సంబరాల్లో పాల్గొంటారని నిర్వాహకులు సీతారామరాజు, ఏలేటి నానిబాబు, చల్లా ఉమారాజమంగతాయారులు తెలిపారు.

తొండంగి: చెకుముకి టాలెంట్‌టెస్ట్ విజేతలకు ఏ.కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో బహుమతులు అందించారు.మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 43 జట్లు పాల్గొనగా సీనియర్ జూనియర్ విభాగంలో విజేతలకు బహుమతులు అందించారు. ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ మాణిక్యం, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.వెంకటేశ్వరావు, పి.సత్యారావు, చంటిబాబు, ప్రకాశరావు ఉన్నారు.

'విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలి'

కాకినాడ సిటీ, అక్టోబరు 1: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ మంగవారం కలెక్టరేట్ వద్ద విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. శిబిరాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ, సీహెచ్ రాజ్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, పి.సత్యనారాయణ ప్రారంభించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగసూరిబాబు, విద్యార్థి జేఏసీ నాయడుడు బుల్లిరాజు, పీడీఎస్‌యూ (వి) జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, డీవైఎఫ్ఐ జిల్లా సహ కన్వీనర్ దుర్గాప్రసాద్ మాట్లాడారు. అనంతరం దీక్షాపరులకు సీఐటీయూ జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు పలివెల వీరబాబు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.

'కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి'

పెద్దాపురం, అక్టోబరు 1: విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆధ్వర్యంలో మండలంలోని పులిమేరు గ్రామంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకుని అఖిలపక్షంతో కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అలాగే తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ముసిలి బాబు, అన్నవరం, నారాయణరావు, భూషణం, తమ్మిబాబు తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో భోజనాలు

జగ్గంపేట, అక్టోబరు 1: జగ్గంపేట పాత పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్‌ను నిర్వహించారు. ఉప్పలపాడు గ్రామానికి చెందిన మేడిబోయిన గోవిందరాజులు సత్యవతి (లేటు)దంపతుల కుమారులు మేడిబోయిన శ్రీను బ్రదర్స్ ఆర్థిక సాయంతో భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మేడిబోయిన శ్రీను, అంకం ఓం, కృష్ణదూది బ్రదర్స్, తలాటం సూరిబాబు, అడబాల బాబురావు, మాదారపు వీరబాబు, మరిసే రామకృష్ణ, దొడ్డి శ్రీను, సూరపు రెడ్డి నరేష్, రేపూరి శ్రీనివాస్, బచ్చల రాజు పాల్గొన్నారు.

జగ్గంపేటకు చేరుకున్న దివ్యాంగుల ఉపకరణాలు

జగ్గంపేట, అక్టోబరు 1: స్థానిక జ్యోతుల నెహ్రూ కాలనీలో గల జ్యోతుల మణమ్మ కల్యాణ మండపానికి విభిన్న ప్రతాభావంతులు (దివ్యాంగులు) ఉపయోగించుకునే ఉపకరణాలు చేరుకున్నాయి. జిల్లా టీడీపీ విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు మండపాక అప్పన్నదొర మాట్లాడుతూ ఆగస్టులో జగ్గంపేటలో నిర్వహించిన దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరంలో గుర్తించిన బ్యాటరీ ట్రై సైకిళ్ళు, ట్రైసైకిళ్ళు, వినికిడి యంత్రాలు, కృత్రిమ కాళ్ళు జగ్గంపేట చేరుకున్నాయని.. అక్టోబరు 7న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతులమీదుగా దివ్యాంగులకు వాటిని అందజేస్తారని పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని నిరసన

తాళ్లరేవు, అక్టోబరు 1: మద్యంషాపుల్లో లిక్కర్ విక్రయించే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని తాళ్లరేవు ఎక్సైజ్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఎస్.రామప్రసాద్ మాట్లాడుతూ తాళ్లరేవు మండలంలో 6 మద్యంషాపుల్లో సుమారు 25మంది ఉద్యోగులు పని కాలం ముగిసిందని, ప్రభుత్వం మాకు ఉద్యోగ భద్రత కల్పించి హామీ ఇస్తే విధుల్లో కొనసాగుతామన్నారు. అనంతరం ఎక్సైజ్ సీఐ కె.కోటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీ.శ్రీను, ఎమ్.రాజు, ఎమ్.గణేష్, సీహెచ్.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూరంపాలెంలో 'స్వచ్ఛత హీ సేవా'

గండేపల్లి, అక్టోబరు 1: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదిత్య యూనివర్శిటీ విద్యార్థులతో సూరంపాలెం గ్రామంలో పరిసరాలు శుభ్రం చేసినట్టు యూనివర్శిటీ డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. పంచాయతీ, అంగన్వాడీ, మెయిన్‌రోడ్డు సమీపంలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి పంచాయతీ వాహనంలో డంపింగ్‌యార్డుకు చేర్చారన్నారు. సర్పంచ్ పోసిని బాబురావు పాల్గొన్నారు.

మద్యం షాపులను అప్పగించాలి



యనమలకు వినతి అందజేస్తున్న గీత కార్మికులు

తుని రూరల్, అక్టోబరు 1: రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన నూతన మద్యం పాలసీ విధానంలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన 10శాతం మద్యం షాపులను కల్లుగీత కార్మిక సంఘాలకు అప్పగించాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కల్లుగీత కార్మిక సంఘం నాయకులు కోరారు. తమ జాతి ఉన్నతికి సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయమని, అయితే క్షేత్రస్థాయిలో వాటి అమలకు చొరవ చూపాలని కోరారు. తేటగుంటలో క్యాంపు కార్యాలయంలో యనమలకు వినతి అందజేశారు.

యనమలను కలిసిన డీఎస్పీ

ఇటీవల పెద్దాపురం డీఎస్పీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీహరిరాజు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని తేటగుంట టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతి భద్రతల అంశాలపై యనమల చర్చించారు. డీఎస్పీ వెంట రూరల్ సీఐ చెన్న కేశవరావు, రూరల్ ఎస్ఐ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

చినరాజప్ప తిరుమల సందర్శన

సామర్లకోట, అక్టోబరు 1: పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పుట్టినరోజు సందర్భంగా బుధవారం తిరుమలలో వేంకటేశ్వరస్వామిని కుటుంబసమేతంగా దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాజప్ప మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్ర ప్రజలకు సంక్షేమంతో కూడిన పాలనందించేందుకు వెంకన్న ఆశీస్సులు అందజేయాలని కుటుంబ సమేతంగా కోరుకున్నట్టు తెలిపారు. రాజప్ప సతీమణి అనూరాధ, కుమారుడు రంగనాగ్, కుమార్తె, కోడలు, మనుమలు ఉన్నారు.

చినరాజప్ప పుట్టినరోజు వేడుకలు

పెద్దాపురం: పట్టణ, మండల పరిధిలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పుట్టినరోజు వేడుకలు కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. గ్రామాల్లో కేక్ కట్ చేసి తమ అభిమానాన్ని తెలియచేశారు. పట్టణ పరిధిలోని జనసేన కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి (బాబు) ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. అధిక సంఖ్యలో కూటమినేతలు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన బుల్లిరాజు

ప్రత్తిపాడు, అక్టోబరు 1: ప్రత్తిపాడు నియోజకవర్గ బీసీ సంఘ నాయకుడు యల్లపు బుల్లిరాజు మంగళవారం అమరావతి టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిశారు. టీటీడీ చైర్మన్ పదవి నియామకంలో తనకు అవకాశం కల్పించాలని కోరారు. టీడీపీకి తమ కుటుంబం ఎంతో సేవలు అందించిందని, తమ పూర్వీకులకు చెందిన రూ.100కోట్లు విలువ చేసే 33 ఎకరాల భూమిని కిర్లంపూడిలో పేద ప్రజలకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు బుల్లిరాజు తెలుపుతూ టీడీపీ నాయకులకు వినతి ఇచ్చారు.

నేటి నుంచి శ్రీ ప్రకాష్‌లో కబడ్డీ, వాలీబాల్ పోటీలు

తుని రూరల్, అక్టోబరు 1: సీబీఎస్‌ఈ బోర్డు నిర్వహిస్తున్న క్లస్టర్-7 (ఆంధ్రా, తెలంగాణా) బాలికల కబడ్డీ, వాలీబాల్ పోటీలు శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఈ నెల 2 నుంచి 4వరకు జరుగుతున్నాయని విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ తెలిపారు. పోటీలు బాలికలకు అండర్14,17, 19 విభాగాలలో జరుగుతాయని.. ఆంధ్రా, తెలంగాణ నుంచి సుమారు 1200 మంది విద్యార్థినులు పాల్గొంటారని.. వారికి కావాల్సిన వసతి, ఆటలకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన పేర్కొన్నారు.

'ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు'

సర్పవరం జంక్షన్, అక్టోబరు 1: చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు సత్వరంగా అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సీహెచ్ గణపతి తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖ నుంచి బదిలీపై జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ షాన్ మోహన్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

'రక్తదానంతో పునర్జన్మ'

కాకినాడ క్రైం, అక్టోబరు 1: రక్తదానంతో పునర్జన్మ ప్రసాదించినవారు అవుతారని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి అన్నారు. జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా మంగళవారం జీజీహెచ్ రక్తనిధి కేంద్రంలో ఆర్ఎంసీ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. 57 యూనిట్ల రక్తం బాటిల్స్ సేకరించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ డాక్టర్ తరుణ్, వైద్యులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎం

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 1: సాధారణ బదిలీల్లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజరు ఎం.దేవులనాయక్ కాకినాడ జిల్లాకు బదిలీ అయ్యారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి మొక్క అందించారు.

పవన్ ప్రాయశ్చిత్త దీక్షలో భాగస్వాములు కావాలి

» ఎమ్మెల్యే నానాజీ » గొడారిగుంటలో ఓం నమో నారాయణాయ మంత్ర పఠనం



పూజలు నిర్వహిస్తున్న నానాజీ దంపతులు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 1: తిరుమల ప్రసాదం విశిష్టత, సనాతన ధర్మాన్ని భావితరాలకు చాటి చెప్పేలా డిప్యూటీ సీఎం పవన్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. టీటీడీ లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి అవకతవకలపై గత 11 రోజులుగా డిప్యూటీ సీఎం పవన్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా మంగళవారం గొడారిగుంటలో ఎమ్మెల్యే నానాజీ, అరుణ దంపతుల ఆధ్వర్యంలో టీటీడీ వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఓం నమో నారాయణాయ మంత్ర పఠనం కార్యక్రమం వైభవంగా జరిపారు. వేద పండితులు, బ్రాహ్మణ పురోహితులను సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పెంకే శ్రీనివాస బాబా, నులుకుర్తి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు, రంబాల వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పూజలో పాల్గొన్న భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

కాగడాల ర్యాలీ



కిర్లంపూడిలో ర్యాలీ చేస్తున్న తుమ్మలపల్లి

కిర్లంపూడి, అక్టోబరు 1: కిర్లంపూడిలో మంగళవారం జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో జనసేన నాయకులు కాగడాల ర్యాలీ నిర్వహించారు. ఏనుగుల వీధి నుంచి జగపతినగరం గౌరీపరమేశ్వర ఆలయం వరకు సనాతన ధర్మపరిరక్షణ కోసం కృషి చేయాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. తుమ్మలపల్లి మాట్లాడుతూ తిరుపతి లడ్డూ కల్తీకి పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్లపు దొరబాబు, గంధం ప్రభాకర్, మేడిబోయిన శ్రీను, సూరంపాలెం బాలు, మాదారపు వీరబాబు, మరిసే రామకృష్ణ, మొగిలి గంగాధర్, ఎంపీటీసీ దొడ్డా శ్రీను, ఎంపీటీసీ గోకాడ రాజా, నాగు, నల్లల శివ, రాపేటి చిట్టిబాబు, కాయల మణికంఠ పాల్గొన్నారు.

జనసైనికుల దీక్ష

కాకినాడ సిటీ, అక్టోబరు 1: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావంగా భానుగుడి సెంటర్ వద్ద జనసైనికులు దీక్ష చేపట్టారు. ఆధ్వర్యం వహించిన రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ మాట్లాడుతూ తిరుమలలో ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో జరగకూడదన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తలాటం సత్య, చోడిశెట్టి శ్రీమన్నారాయణ, ఆకుల శ్రీనివాస్, దేశినీడి సత్యప్రసాద్, మాదవరపు రాజేష్, సుంకర సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశేష శాంతిహోమం

పిఠాపురం, అక్టోబరు 1: పట్టణంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో లోకకల్యాణార్థం విశేష శాంతిహోమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు పి.విజయజనార్థనాచార్యులు, యాగ్నిక బ్రహ్మ సుదర్శనం మాధవ, మణికంఠాచార్యుల ఆధ్వర్యంలో విశ్వక్సేనపూజ, పుణ్యాహావచనం నిర్వహించి శాంతిహోమం జరిపించారు. జనసేన మహిళ విభాగం ఉమ్మడి గోదావరి జిల్లాల ఇన్‌చార్జి చల్లా లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హోమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, పిఠాపురం, జగ్గంపేట ఇన్‌చార్జిలు మర్రెడ్డి శ్రీనివాసరావు, తుమ్మలపల్లి రమేష్, సూరవరపు సురేష్, మార్నీడి రంగబాబు, తోలేటి శిరీష, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, వెన్నా జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏలేరు, సుద్దగడ్డ వరద తగ్గుముఖం

తొలగిపోతోన్న ముంపు



ఏలేరు కాలువలో తగ్గిన వరద నీటి ప్రవాహం

పిఠాపురం/గొల్లప్రోలు, అక్టోబరు 1: ఏలేరు, సుద్దగడ్డ వరద తగ్గుముఖం పట్టింది. దీంతో ముంపు ప్రభావం తొలగిపోతోంది. కాలువల చెంతన, గండ్లు పడిన ప్రాంతాల్లో ఉన్న పొలాల్లోని నీరు తగ్గింది. ఏలేరు రిజర్వాయర్ నుంచి విడుదల చేస్తున్న నీటిని గణనీయంగా తగ్గించారు. ప్రస్తుతం ఎగువ ప్రాంతాలు, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 2014 క్యూసెక్కుల నీరు వస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను 1800 క్యూసెక్కులకు పరిమితం చేశారు. కాలువలకు వేయి క్యూసెక్కుల నీటిని, డీసీఆర్ స్లూయిస్ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, విశాఖ తాగునీటి అవసరాలకు 200 క్యూసెక్కుల నీటిని పంపిస్తున్నారు. ప్రస్తుతం పిఠాపురం, గొల్లప్రోలు వద్ద ఏలేరు కాలువలు సాధారణ స్థాయిలో ప్రవహిస్తున్నాయి. పంటపొలాల్లో ముంపు తగ్గింది. అక్కడక్కడా స్వల్పంగా నీరు నిలిచి ఉంది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో అవుట్‌ఫ్లోస్‌ను తగ్గించామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. మరోవైపు సుద్దగడ్డ వరద ఉధృతి తగ్గింది. గొల్లప్రోలు పట్టణ శివారు జగనన్న కాలనీకివెళ్లే రహదారిపై నీరు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు.



ఆదిపరాశక్తి వేషధారణ

దసరా సంబరాలు

గొల్లప్రోలు, అక్టోబరు 1: పట్టణంలోని మాధురి విద్యాలయలో మంగళవారం దసరా సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ, నవదుర్గలు, ఆదిపరాశక్తి వేషధారణలతో అలరించారు. దేవీ నవరాత్రుల విశిష్టతను తెలియజేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రావణాసుర సంహారంపై ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమాల్లో మాధురి విద్యాసంస్థల అధినేత కడారి తమ్మయ్యనాయుడు, సీతాదేవి, ప్రిన్సిపాల్ మమత తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా సీజ్

కాకినాడ రూరల్, అక్టోబరు 1: చీడిగలోని వాసంశెట్టి వీరబాబుకు చెందిన రేకుల షెడ్‌లో అనుమతి లేకుండా నిల్వఉంచిన సుమారు రూ.55,000 విలువ గల ఫైర్ క్రేకర్స్ తదితర బాణసంచా సామగ్రిని సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ వీరబాబు తెలిపారు.



బాక్సింగ్ పోటీలకు ఎంపికైన పిఠాపురం విద్యార్థులు

రాష్ట్రస్థాయి బాక్సింగ్, రగ్బీ పోటీలకు పిఠాపురం విద్యార్థుల ఎంపిక

పిఠాపురం, అక్టోబరు 1: రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు పిఠాపురం విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారటీ క్రీడా మైదానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో బాక్సింగ్ పోటీలు, సెలక్షన్ ట్రయిల్స్ జరిగాయి. మహిళల 57కిలోల విభాగంలో కె.హారిణి, ఓపెన్ వెయిట్ కేటగిరిలో జే ఐశ్వర్య పురుషుల విభాగం 75కిలోల కేటగిరిలో జేఆర్ ఆదిత్య ఎంపికయ్యారు. త్వరలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో పాల్గొంటారని కోచ్ లక్ష్మణరావు తెలిపారు. రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో గల బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన ఎంపికల్లో అండర్-14 విభాగంలో ఎనిమిదవ తరగతి విద్యార్థినులు పి.మనోజ్ఞ లక్ష్మీశ్రీ, ఆర్.విజయలక్ష్మి, అండర్ 17 విభాగంలో 10,9వ తరగతుల విద్యార్థినులు దొడ్డి గంగాభవానీ, జి.మణిరాజేశ్వరి ఎంపికయ్యారు. పాఠశాల హెచ్ఎం శ్యాంబాబు, వ్యాయామ ఉపాధ్యాయులు శేషుకుమారి, సత్యప్రియలు అభినందించారు.

వాలీబాల్ జట్టుకు ఎంపిక

జగ్గంపేట రూరల్, అక్టోబరు 1: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలికల జిల్లాస్థాయిలో జరిగిన వాలీబాల్ సెలక్షన్స్‌లో ప్రతిభ కనబరిచి కాట్రావులపల్లి విద్యార్థిని పోకల దుర్గ స్టేట్ వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు పి.శ్రీనివాసరావు తెలిపారు. పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన రౌతులపూడి విద్యార్థులు

రౌతులపూడి, అక్టోబరు 1: అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 విభాగంలో ట్రయత్లన్, కిడ్స్ జావలిన్ పోటీలు గత 22న కాకినాడలో నిర్వహించగా రౌతులపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి శీరరెడ్డి కుశరాజు జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అండర్ 16 విభాగంలో పదో తరగతి విద్యార్థి బళ్లాడి రోహిత్ లాంగ్ జంప్‌లో ద్వితీయస్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. వాలీబాల్ విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థి గొరికపూడి అభినయ్ ఎంపికయ్యాడు. ఈ నెల 4 నుంచి 6 వరకూ రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వారు పాల్గొనున్నారు.

కబడ్డీ పోటీలకు వాకతిప్ప విద్యార్థులు

కొత్తపల్లి, అక్టోబరు 1: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కొత్తపల్లి మండలం వాకతిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. సెప్టెంబరు 30న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాకినాడలో జరిగిన అండర్ 17 విభాగంలో కబడ్డీ పోటీలకు పదో తరగతి చదువుతున్న దడాల సజీవ, తూటి దీపక్. అండర్ 14విభాగంలో తొమ్మిదో తరగతి చదువుతున్న పక్కుర్తి వెంకటసాయి చైతన్య ప్రధానోపాధ్యాయుడు పి.కృపారావు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కనపర్తి నూకరాజు, సర్పంచ్ పాలాని దొరబాబు, ఎస్ఎంసీ చైర్మన్ చందనాల సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, జనసేన నాయకుడు రావు అక్షయ్ అభినందించారు.

కబడ్డీ పోటీలకు ఎంపిక

అన్నవరం, అక్టోబరు 1: గ్రామంలో జడ్పీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు సీతామహాలక్ష్మి తెలిపారు. 10వ తరగతి చదువుతున్న అల్లిపల్లి రూపను సెప్టెంబరు 30న స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 17 బాలికల పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపికైందని చెప్పారు. విద్యార్థినిని వ్యాయామ ఉపాధ్యాయులు భూర్తి తాతాజీ, ఎస్ఎంసీ చైర్మన్ బోడపాటి లూధియా, ఉపాధ్యాయులు అభినందించారు.

హాకీ జట్టుకు ఎంపిక

కాకినాడ అర్బన్, అక్టోబరు 1: కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరిగిన ఉమ్మడి జిల్లా హాకీ జట్టు ఎంపికలో వీఆర్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు పి.సాయిలక్ష్మి, ఎస్.మానస స్థానం దక్కించుకున్నారు. అండర్ 14, 17 విభాగాల్లో ఎంపికైన వారు నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. వారిని ప్రధానోపాధ్యాయుడు కేవీవీ సత్యనారాయణ, పీడీ సయ్యద్ మస్తానీ బేగం అభినందించారు.

వరద బాధితులకు విరాళం

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 1: వరద బాధితుల సహాయార్థం కాకినాడ ఆంధ్రా బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులు సేకరించిన రూ.66,817 మొత్తాన్ని చెక్కు రూపంలో సీఎం సహాయనిధికి కలెక్టర్ షాన్‌మోహన్‌కు అందజేశారు. ఎల్‌డీఎం ప్రసాద్, సత్యనారాయణ, మూర్తి, ఎస్.సత్యనారాయణ, తాతారావు, రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ: వరద బాధితుల సహాయార్థం బర్రి నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు తరపున రూ.10వేలు విరాళం చెక్కును కలెక్టర్‌కు అందజేశారు. ట్రస్టు సభ్యులు తాతారావు, మల్లికార్జునరావు, ఆర్‌జే రామారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

రౌతులపూడి, అక్టోబరు 1: లచ్చిరెడ్డిపాలెం గ్రామ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు విజయవాడ వరద బాధితుల కోసం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రధోపాధ్యాయుడు శేషకుమార్, చైర్మన్ కే.రాజుకు సొమ్ము అందజేసి విజయవాడ పంపాలని కోరారు.

'నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు'

జగ్గంపేట, అక్టోబరు 1: జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం 3 ఆటోలతో 3 మండలాల్లో ప్రచారం చేయించారు. నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని.. పేకాట, గుండాట, కోడిపందాలు వంటివి నిర్వహిస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరిక జారీ చేశారు.

'పౌష్టికాహారం తీసుకోండి'

కిర్లంపూడి, అక్టోబరు 1: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకుంటేనే అనారోగ్య సమస్యలు దరిచేరవని సూపర్‌వైజర్ పి.బూసమ్మ అన్నారు. చిల్లంగి సెక్టార్ పరిధిలో మహిళలు, బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయరాదని, చిన్న పిల్లలను బాల కార్మికులుగా ఉపయోగించుకోరాదని తెలిపారు.

ఎక్సైజ్ ఎస్ఐగా వంశీరామ్

ప్రత్తిపాడు, అక్టోబరు 1: ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్ఐగా వంశీరామ్ పదవీ బాధ్యతలు చేపట్టారు. కోరుకొండ ఎస్ఐగా పని చేస్తూ బదిలీపై ఆయన ఇక్కడ జాయిన్ అయ్యారు. స్థానిక ఎక్సైజ్ సిబ్బంది కలిసి అభినందించారు. వంశీరామ్ ఎక్సైజ్ సీఐ శివప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆటో, బైక్‌లను ఢీకొన్న కారు

ప్రత్తిపాడు, అక్టోబరు 1: మండలంలోని ధర్మవరం వైఎస్సార్ కాలనీ వద్ద మంగళవారం ఉదయం చిన్నకారు వేగంగా వచ్చి ఎలక్ట్రికల్ ఆటో, రెండు మోటార్‌బైక్‌లను ఢీకొంది. కిర్లంపూడికి చెందిన ఒక యువకుడు మద్యంతాగి నిర్లక్ష్యంగా వాహనం నడపడంతో ఈ ప్రమాదం జరిగింది. వాహనాలు వద్ద నిల్చున్న వారు ప్రమాదం నుంచి తప్పించుకోగా ఆటో, బైక్స్ దెబ్బతిన్నాయి. చిన్నకారు ముందుభాగం ధ్వంసమైంది.

దుర్గాడలో మాసశివరాత్రి పూజలు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 1: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మహాగణపతిపూజ, మహాన్యాసపారాయణ, 11 రుద్రాలు, 21 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించి స్వామి,అమ్మవార్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా, ఆలయ సేవాసమితి సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.